# జైలు

**— బొబ్బల వెంకటేశ్వర నాయుడు**

రాత్రి పన్నెండు గంటలయింది. జైలు మన్ను తిన్న పాములాగా మత్తుగా నిద్దురపోతోంది. మూడు వైపులా పూర్తి గోడలూ, ఒక వైపు కటకటాలూ వున్న బ్యారక్ నెంబర్ నాలుగు కూడా చలిని ఆపుతున్నానని భ్రమిస్తోంది. కానీ, అది భ్రమించడమేనని బ్యారక్‌లోని ఖైదీలు నిద్దురపట్టక కదులుతున్నదాన్ని బట్టే అర్థమవుతోంది. రెండు వంద క్యాండిల్ బల్బులు బ్యారక్ నాలుగులోని చీకటిని పారద్రోలాలని శత విధాల ప్రయత్నిస్తున్నాయి. జైలు మెయిన్ టవర్ మీది సెర్చి లైట్లు వుండి, వుండి నాలుగు దిక్కులకూ తన కాంతిని సారించి కండ్లు చిట్లించి చూస్తోంది.

నిద్దుర పట్టక గతం మనస్సును తొలిచేస్తుంటే గుండె పట్టినట్లయి లేచి కూర్చున్నాడు రోశాలు. బండల మీద పరుచుకున్న ప్రక్క దుప్పటి క్రింది నుంచి సగం త్రాగి దాచుకున్న చుట్ట, అగ్గిపెట్టె బయటికి తీశాడు. చుట్ట వెలిగించుకుని తొందర, తొందరగా రెండు దమ్ములు లాగి గుండెల నిండా పొగను ఒక్క నిమిషం అట్టేపెట్టాడు. శరీరం కాస్తంత వేడయినా పొలమారింది. ఖళ్ళు ఖళ్ళు మని దగ్గు గుండెల్ని తన్నుకొచ్చింది. గుండెల్లో రేగిన మంటతో తల్లడిల్లిపోయాడు. కండ్ల వెంట కన్నీటితోపాటు ఆపద సమయంలో మనిషి ఉచ్చరించే అమ్మా అనే పిలుపుకు బదులు సుక్కా!! అన్న పిలుపు (అరుపు) రోశాలు గొంతు నరాలు తెంపుకుని నాలుగవ నెంబర్ బ్యారక్‌తోపాటు తక్కిన బ్యారక్‌లను నిద్దుర లేపుతూ జైలంతా సందడి చేసింది. బ్యారక్‌లో ఖైదీలని ముద్రపడిన ముద్దాయిలంతా లేచి రోశాలు దగ్గరకు చేరారు.


"రోశాలూ ఏమయింది. అట్టా కూర్చునే కలవరించావేంది?" అడిగాడు భద్రాచలం. బాంబు దాడిలో పట్టుబడ్డ ప్రముఖ నక్సలైటు పాపులు.

"ఏమయిందన్నా? ఏమయిందే? కళ్ళు తిరుగుతున్నయా? కడుపులో తిప్పుతుందా? అమ్మ గుర్తొచ్చిందా?" ప్రశ్న మీద ప్రశ్న లేశారు చుట్టూ చేరిన ఖైదీలు.

ఎక్కడ పుట్టారో, ఎక్కడ పెరిగారో, ఏ ఆవేశంలో, ఏ సుఖంలో తప్పు చేశారో ఇక్కడ కొచ్చారు! ఎంత ఆప్యాయత, ఎంత ఆపేక్ష, ఎం అభిమానం! [illegible] ఖైదీల మాటల్లో తనవాళ్ళు గుర్తుకొచ్చి రోశాలు కం[illegible] ఆగకుండా వర్షించాయి. మోకాళ్ళలో తలదాచుకుని పెద్దగా ఏడ్చాడు. సొట్టలు పడ్డ చెంపలు, వెదురు మదురుగా పెరిగిన వెంపలి పూత లాంటి గడ్డం, లోతుకు పీక్కుపోయిన కండ్లు, బ్రహ్మ రాసిన గీతల్నే, బతుకు రాతల్నే ప్రస్ఫుటంగా చూపించే నుదురు, ఎండుకుపోయి బొమికెలు తేలిన ఛాతీ! రోశాలును చూసి పాపులు గుండె చెరువయింది.

ఆప్యాయంగా రోశాలు భుజం పైని చెయ్యి వేశాడు. "ఏం జరిగిందన్నా, జైలుఖానా కొచ్చి పది దినాలయినా ఒక్క మాటన్నా మాట్లాడవైతివి. ప్రతిరాత్రీ సుక్కా, సుక్కా అని ఒకటే కలవరింతలు. చెప్పన్నా, ఏం జరిగింది. నీకు శిక్షెందుకు పడ్డది?" అడిగాడు పాపులు.

'పహారా హుషార్' చెబుతూ డ్యూటీలో వున్న వార్డర్ లాఠీతో బ్యారక్ తలుపు మీద కొట్టి గద్దించాడు. "పాపులు సార్! పది దాటిం తరువాత ఇలాంటి సమావేశాలు వెయ్యద్దు పడుకోండి, పడుకోండి."




"నిద్దుర పట్టక బతుకు బాధల్ని చెప్పుకుంటున్నావ్. సమావేశాలు కాదు" జవాబిచ్చాడు పాపులు కాస్త వ్యంగ్యంగా.

"నీతో ఏది మాట్లాడినా ఎకసక్కెమే పాపులు సార్! జైలర్ చెకింగ్ కొస్తే నాకు మెమో ఇస్తాడు, పడుకోండి సార్" ఈ సారి వార్డెన్ గొంతులో నా కడుపు మీద కొట్టొద్దని బతిమాలుకునే ధోరణి కనిపించింది.

"అలాగే, అలాగేలే నీ వెళ్ళు" చెప్పాడు పాపులు.

గొణుక్కుంటూ వెళ్ళిపోయాడు వార్డర్.

"చెప్పన్నా, జరిగింది చెప్పుకుంటే మనస్సులో బాధ అంతో, ఇంతో తీరిపోద్ది చెప్పు!" గ్లాసుతో నీళ్ళు తెప్పించి త్రాగమని రోశాలుకిచ్చి, త్రాగి కాస్తంత సేదతీరిన తరువాత అడిగాడు పాపులు.

తల ఎత్తి శూన్యంలోకి చూశాడు రోశాలు. మొదటగా ఏవో రంగులు, తరువాత ఆ రంగుల్లో తన ఊరు, ఊరి మొగదాల వంక మూలతో సుక్క, తన సుక్క. క్రూర వేతికొచ్చినా కడుపు మాసి అన్నం పెట్టే అమ్మ, ఊరి దొర, ఒక్కొక్కరే కండ్ల ముందు కనబడ్డారు.

"కాల్చుకోవే" అగ్గిపుల్ల వెలిగించాడు పాపులు.

చుట్ట కాల్చుకొని పొగ పీల్చి బయటకొదిలి "నా కతంతా చెప్తానన్నా" అన్నాడు రోశాలు.

ఖైదీలంతా ఉత్కంఠతో ముందుకు వంగారు వినడానికి.

* * *

"సూదులూ, పిన్నీసులూ, అద్దాలూ, మొలదారాలూ, కాటుక, కుంకుమ, ఇంగువా, పోడరు డబ్బాలోయ్" అన్న కేక అడవికి దగ్గరున్న ఆ గ్రామంలో కొండగాలిలో తేలుతూ ఊరవతల గూడెంలో తన గుడిసె ముంగిట కట్టెలు కొడుతున్న రోశాలు చెవుల్లో పడి గుండెల్లో తియ్యని అనుభూతిని రేపింది.

కొడుతున్న కట్టెల మీద గొడ్డలి వదిలి, మూరు మీద వేసిన కండువాతో మొహం మీద, వంటి మీద ఎండ

కిరణాలు పడి మెరుస్తున్న చెమటను అద్దుకొని ఒక్కంగలో వీథిలోకి వచ్చాడు.



అల్లంత దూరాన గూడెంలోకి వస్తున్న సుక్క కనబడింది రోశాలు కండ్లకు. గూడెంలోకి అడుగు పెడుతూనే రోశాలు కోసం వెదికాయి సుక్క చూపులు. తన వేపే చూస్తూ నిలుచున్న రోశాలు కనబడ్డాడు.

సుక్క నరనరాల్లో ఏదో తెలియని తీపి మొదలయింది. తన ప్రమేయం లేకుండానే అడుగులు రోశాలు వైపు దారి తీశాయి. రోశాలు కూడా రెండడుగులు సుక్క వైపు వేశాడు. ఒకరి కొకరు దగ్గరయ్యారు.

"ఏంటే అట్టా సూత్తున్నావు?" కాళ్ళకున్న గిల్టు పట్టీలు ఘళ్ళు మనిపిస్తూ ఎడమ చంకనున్న సరకు మూట కుడి చంకకు మార్చుకుంటూ అంది సుక్క. "నీ కోసం కాదులే.. దున్నకుర్ర కనబడక ఎతుక్కుంటున్నాను" అన్నాడు రోశాలు సుక్కను ఉడికించాలని.

"ఓయబ్బో! దున్నకుర్ర కోసం సూసేవోడు అట్టా నేను గూడెంలోకి రాగానే ఎందుకెదురొచ్చినట్టో" ఒక విసురు విసిరింది సుక్క.

"ఆ! పూసలోల్ల పిల్ల వత్తుంది ఒక ముద్దెట్టుకుందామని సూత్తున్న ఎల్లహే! ఎప్పుడన్నా అద్దంలో మొహం సూసుకున్నావా?" తనేం తక్కువ తిననట్లు చురక తగిలించాడు రోశాలు.

"అబ్బో అందగాడు వచ్చాడు సెన్నాపట్నం యిరో"

"కాదు కాదు, దేవలోకం పిల్చొచ్చిందని."

"అవును నేనే కర్రి ముద్దుని, మొన్న కరణం

గారింటి దగ్గర ఆళ్ళ జీత గాడంటుంటే, గూడెంలో మొగతాడేయని క్రి మొద్దుందని దానికి ఎట్టయినా మొగతాడేయాలని—"

"ఏందే! నేను క్రిమొద్దువా?" కోపం నసాలాని కంటె సుక్క చెవి పట్టుకున్నాడు రోశాలు.

"నేను విన్నన్నానా ఏంది?"

"మరి ఎవురినన్నావే?" చెవి వదిలి బుగ్గ పట్టుకున్నాడు రోశాలు.

"ఇదిగో నీ ఎవ్వారం ఏం బాగాలేదు. ఏంది బుగ్గ పట్టుకుంటావ్? నువ్వేమన్నా కట్టుకున్న మొగుడివా?" రోశాలు చేయి విదిలించివేస్తూ ప్రశ్నించింది సుక్క.


"నీ కులపోన్ని కాదుగానీ, ఎప్పటికయినా నీ మెళ్ళో మూడుముళ్ళు ఎయ్యాల్సినోన్ని నేనే గదా!"

"గూడెపోళ్ళకి, గుండెలు తీసినోళ్ళకి మా అయ్య నన్నిచ్చి పెళ్ళిసెయ్యడు తెలుసా?" మొహంలో లేని గాంభీర్యాన్ని ప్రదర్శించింది సుక్క.

"ఏందీ నిజంగానే అంటున్నావా? నిజంగానే మన పెళ్ళి జరుగదా" కళ్ళలో నీళ్ళు చిప్పిళ్ళుతుండగా సుక్క మొహం చేతుల్లోకి తీసుకుని అన్నాడు రోశాలు.

రోశాలు మొహం చూడగానే సుక్క మనస్సు జావగారిపోయింది.

"చాల్లే సంబడం ఆడదానిలాగా ఏందా ఏడుపు? అయినా నిన్నుగాక నేనెవరికీ తలొంచను ఆ!" అంది.




రోశాలు ఎగిరి గంతేశాడు. "సుక్కలాంటి నా సుక్కా! నిన్నొదిలి నేనుండలేను. పేనాలయినా వదిలేత్తాగాని నువ్వు లేని బ్రతుకు నా కొద్దే" పక్కనే వున్న గుడిసె ముందు అరుగు మీద సుక్కను కూర్చోబెడుతూ తన అభిప్రాయాన్ని నిక్కచ్చిగా తేల్చేశాడు.

"నేను మాత్రం నిన్ను సూడందే ఒక్క పూటయినా వుంటనా?" అరుగు మీద కూర్చున్న రోశాలు గుండెల్లో తల పెడుతూ తన ప్రేమకు నిర్వచనాన్ని ఇచ్చింది సుక్క.

గుండిసె ముందు అరుగుమీద ఆడ, మగ ప్రేమ కలాపం మాపుకు ఆనక కండ్లపైని చేయి అడ్డం పెట్టి కొని ప్రశ్నించాడు దారినే పోతున్న గూడెం పెద్ద.

"ఎవ్రరా అది. మిట్టమధ్యాన మేల అరుగుల మీద కబుర్లేత్తున్నారు!" అని.

సుక్క బుజాలు పట్టి తన కదుముకుంటూ రోశాలూ, రోశాలు తలలో వేళ్ళు జొనిపి వెంట్రుకలతో ఆడుకుంటున్న సుక్కా తన్మయావస్థలో నుంచి ఇహం లోకి వచ్చిపడ్డారు గూడెం పెద్ద పలకరింపుతో.

"అబ్బే ఓరుందే, మన పూసలోల్ల పిల్ల సుక్క పోడర్లు సూపిత్తుంటే బేరమాడ్తున్న నేనుగాదూ! మాలచ్చి కొడుకుని రోశాలుని."

"ఓర్నియమ్మ కడుపుగాల! నీకు పోడర్లెందుకురా, సోకెక్కువయిందేందిరో" పుసిక్కున నవ్వి వెటకారంగా అన్నాడు గూడెం పెద్ద.

"సాల్లే పెద్దయ్యా! వాయసోన్ని నేనుగాక పోడర్లు వాడేది నువ్వా ఏంది?"

"పోడర్లు వాడితే వాడినవుగానీ, పోరినాదేవు పొగరణగదీత్తరు పూసలోల్లు" పెద్దగా నవ్వి వెళ్ళిపోయాడు గూడెం పెద్ద.

చంక సంచిలో నుంచి సుక్క తీసి ఇచ్చిన పౌడరు డబ్బా తీసికొని సుక్క బుగ్గ గిల్లాడు రోశాలు. సుక్క సమ్మోహనంగా నవ్వింది. వయ్యారంగా కదిలింది.

"ఏంటే, ఎల్లిపోతువ్వావా?" దిగులుగా అడిగాడు రోశాలు.

"ఎల్లిపోక ఈడనే వుండమంటావా ఏందీ? మళ్ళొత్తాలే" జవాబిచ్చింది సుక్క.

అభినందన
మా అభినందన శుభాకాంక్షల పత్రాలు మీ మనోభావాలను తెలియచేస్తాయి!
గ్రీటింగ్ కార్డ్సు
అందమైన ఆలోచనలకు మరోపేరు "అభినందన"
మీ ఆప్తుల హృదయాలను మా అభినందన పత్రాలతో పరవశింపచేయండి
వెన్నెల్లో ప్రకృతి దృశ్యాలు, రకరకాల పువ్వులు రమ్యమైన రంగులలో వచ్చేశాయి!
అభినందన ప్రింటర్సు
పెద్దిభొట్లవారి వీధి, ఏలూరు రోడ్డు, విజయవాడ-2, ఫోన్: 65722
స్పెషలిస్టులు: స్క్రీన్ ప్రింటింగ్ & స్క్రీన్ ప్రింటింగ్ మెటీరియల్స్

"ఎక్కడికి?!"

"ఇంకెక్కడికి రెండో జామున అక్కడికే."

"అక్కడికే అంటే?" అర్థంకానట్టు మొహం పెట్టాడు రోశాలు.

"ఓరి నాయనో! సంగనాచి తుంగబుర్ర. అన్నీ సెప్పాలి. ఇంకెక్కడికి దొరోరి సెరుకు తోటకాడికి" సిగ్గుతో చేయి జాడించి ముందుకు నడిచింది సుక్క.

* * *

అడవి దగ్గరున్న ఆ గ్రామంలో కొండదేవర జాతరంటే ఊరు, ఊరంతా ఒకటే సందడి. పల్లె అంతా కొండ దేవర గుడి దగ్గరే వుంది.

గుడి ముందు కొండ దేవర విందు కొరకు దున్న పోతు తెగాల, అదీ దొరోరి చేతి మీదుగా. ఆ తరువాత మొదలయ్యే జముకుల కథలు, ఒగ్గు కథలు, తోలు బొమ్మలాట, కొండ దేవర భాగోతం వినడానికి, చూడడానికి జనం ఉవ్విళ్ళూరుతున్నారు. మాంచి వెన్నెల రోజులు. పిండారబోసినట్లుంది వెన్నెల.

"జరగండి, జరగండి దొరొస్తుండు, దొరొస్తుండు" జులుంతో కూడిన ప్రకటన వినబడింది.

గుడి ముందు నిలబెట్టిన దున్నను పగ్గాలేసి పట్టుకుని నిలబడ్డారు బలంగా వున్న నలుగురు మనుషులు. పట్టా కత్తి చేతబట్టిన దొర మీసం మెలేసాడు హర, హర మహాదేవ శంభో శంకర అన్న పొలికేకతో చెయ్యెత్తు లేపిన పట్టా కత్తి దున్న మెడమీద దించబోతూ లిప్తపాటు గుడి ప్రక్కకు చూచాడు అప్పుడు కనబడింది ఒడికట్టిన ఉసిళ్ళు, మినపప్పు గుప్పిళ్ళతో తీసుకుని నోట్లో పోసుకుంటూ చెయ్యెత్తినప్పుడు పైట క్రింది సరువాలు రెచ్చగొడుతూ, ఒక కాలు ప్రక్కనున్న రాయి మీద పెట్టి వయ్యారంగా దేవకన్యలాగా నిలబడిన సుక్క!

దొర నమ్మలేని మరొక లిప్తపాటు చూచాడు "వహ్వా ఏం అందం తన ఇలాకాలో ఇంత అందగత్తెయిన పోరి?" మరొక్క మారు హరోం హరా అని అరుస్తూ పట్టా కత్తి పట్టిన చేతిని క్రిందకు దించాడు. బెదిరి గెంత బోయిన దున్న తల తెగి కొండ దేవర విగ్రం ముందు పడింది. పట్టిన పగ్గాలు వదలడంతో తలలేని దున్న విపరీతమైన వేగంతో మైదానంలోనికి పరుగెత్తుకుంటూ వెళ్ళి ముందు కాళ్ళమీద పడి గిలగిల కొట్టుకుంటూ తుది శ్వాస విడిచింది.

## మరణీమణి

కూతురికి కట్నం ఇవ్వనని
కొడుక్కి కట్నం చాలదని
రంగుల రాట్నం తిప్పేది రమణి
కన్నకూతురిపై పన్నీరు చల్లి
కోడలిపై కిరోసిన్ జల్లి
కొంపలు నిలువునా కూల్చేది రమణి
కట్నాలు ఏదో కుదిరినా
ఆడబడుచు కట్నాలు కోరి
పెళ్లి పెటాకులు చేసేది రమణి
కూతురు కూతుళ్లను కన్నా మెచ్చి
కోడలు కొడుకును కనలేదని నొచ్చి
పచ్చని కాపురంలో చిచ్చు పెట్టేది రమణి
ఆడపిల్ల కడుపులో వుండగానే
కట్నం కడుపు చేస్తుందని వినగానే
గర్భస్రావం చేయించేది రమణి
మగాన్ని ఇంజనీరింగ్‌లో చేర్చి
ఆడపిల్లను 'గంజి'నీరింగ్‌లో దూర్చి
నడమంత్రపు సిరికి కులికేది రమణి
లంచాలు పట్టని మొగుడి కంచాన గొట్టి
ఓణీలు ఒలిచి కూతుర్ని మంచాన బెట్టి
'లవ్వు' లార్జించడానికి రొచ్చులో దిగేది రమణి

—ముక్కామల

* * *


"సుక్కా! ఓ సుక్కా! దొరసానమ్మ గారు సరుకుల మూట తీసుకొని రమ్మంటున్నారు? పందిరి క్రింద నులక మంచంలో కూర్చుని పూసల పేరు అల్లుతున్న సుక్కకు చెప్పాడు దొర కుటుంబం శారి.

శారిని చూడగానే గుండె జల్లుమంది సుక్కకు దొరసాని రమ్మందనగానే దిగ చెమటలు పట్టాయి.

"ఎందుకు?"

"దొరసానిగారు బందరు నుండి గవ్వలు తెప్పించారట, దండలు కట్టడానికి రమ్మన్నారు?."

"నేను కట్టే నాసిరకం దండలు దొరసానమ్మగారు ఏసుకుంటారా?"




"ఏమో. నాకేం తెల్సు దొరసానమ్మగారు పిలుచుకు రమ్మన్నారు నేనొచ్చాను."

సెలుపోక చుట్టూ చూసింది సుక్క. అల్లంత దూరాన దొంకలో పేడ తట్ట కెత్తుకుంటున్న రోశాలు తల్లి మాలచ్చి కనబడింది.

పరుగులాంటి నడకతో రోశాలు తల్లిని చేరింది సుక్క.

"అత్తమ్మా!" పిలిచింది సుక్క.

"ఏందే అట్లా సెమటలు పట్టాయి ఏందీ కత" అని హాస్యమాడింది రోశాలు తల్లి.

"అదికాదత్తా మరేమో గవ్వల దండలు కట్టడానికి గడీకి రమ్మని దొరబంటు శారి వచ్చిండు."

"అయితే ఎల్లు, నువ్వు దండలు గట్టడంలో పెద్ద సేయి గదనే."

"అది కాదత్తా...నేనొక్కదాన్నే ఎల్లలేక నువ్వు తోడత్తావని" సంశయం ఏమిటో చెప్పలేక నీళ్ళు నమిలింది సుక్క.

"ఇంటికాడ ఎక్కడ పని అక్కడే వుంది" గునిసింది మాలచ్చి.

"ఒక్కదాన్నే గడీకి ఎల్లటానికి భయంగా వుందత్తా" చెప్పింది సుక్క.

"సరేలే వుండు. సుక్కతో చెప్పి బోరింగు దగ్గర చేతులు కడుక్కుని, పేడ తట్ట ప్రక్కనే నిలిపిన రైతు కొష్టంలో పడవేసి జుట్టు ముడేసుకుంటూ వచ్చింది రోశాలు తల్లి.

సంకకు మూట తగిలించుకొని రోశాలు తల్లి వెంటరాగా, శారి ముందు నడుస్తుంటే వెనకాలే కదిలింది గడీ వేపు సుక్క.

అన్నాల నిలవుతుంది బుక్కెడన్నం పెట్టకపోతారా, అనుకుంది దొర గడీలో భోజనాలు ఇదివరలో ఒకసారి రుచి చూసిన రోశాలు తల్లి.

మాలచ్చి, సుక్క సింహద్వారం దాటగానే తలుపులు కిర్రుమని మూసుకున్నాయి. గడీలోపలివేపు తలుపుల దగ్గరే నిలబడి పోయాడు శారి.

తలుపులు మూసుకున్న చప్పుడుకు వెనకకు చూచి ముందుకు తలెత్తిన మాలచ్చి, సుక్క ఒక్క నిమిషం ముందుకేసిన అడుగు వెనక్కు లాక్కుని అలాగే నిలబడి పోయారు.

* * *

"దండమండీ!" చుట్ట చెప్పకురాచి ఆర్పి చెవి దొప్ప ప్రక్కగా దోపుతూ రెండు చేతులు జోడించాడు రోశాలు.

"ఎవుర్రా అది?" సీకటిలో సరిగా పోల్చుకోలేక ప్రశ్నించాడు రైతు.

"నేనయ్యా మాలచ్చి కొడుకుని రోశాలుని"

"ఏందిరా?"

"పొద్దుగాల పేడకని పోయిన మా అమ్మ ఇంటికి రాలేదు ఏడికి పోయిందా అని సూత్తన్నాను."

"అదేందిరా మీ అమ్మ, పూసలోల్ల పోరి సుక్క దొరసాని రమ్మందంటే శారిగాడి ఎంట గడీకి పోయిరి గదా, యింకారాలే?"

రోశాలు గుండె గుభిల్లుమంది. సుక్క తన సుక్క,

తన తల్లి కలిసి గడికి పోయివారా అంటే? అంటే? రోశాలుకు కాళ్ళూ చేతులు ఆడలేదు.

"సత్తా సామీ!" రైతుతో చెప్పి పెద్ద పెద్ద అంగలు వేస్తూ గడి వైపు నడిచాడు రోశాలు. పల్లెకూ, గడికి మధ్య దూరం మూడు మైళ్ళని, చీకటి వేళ అన్న సంగతి కూడా మరిచిపోయి.

* * *

మబ్బులు లాఠీ కానిస్టేబుళ్ల మాదిరి చకచకా కదిలిపోతున్నాయి. పడమటి వైపు ఆకాశంలో మెరుపు మెరిసింది. జల్లెడ పడుతున్నట్లు వాన జల్లు మొదల య్యింది. రోశాలుకు, గడికి మధ్య దూరం తరిగి పోతుంది. మద్ది చెక్కతో చేసి గుబ్బిళ్ళు కొట్టిన గడీ తలుపుల మీద పరచిన పలుచని ఇత్తడి రేకు మెరుపుమెరి సినప్పుడల్లా తళుక్కుమంటోంది. గడి సమీపానికి రాగానే రోశాలు గుండెల్లో అలజడి మొదలయ్యింది.

ఓమ్మో అంటూ ఎగిరి ప్రక్కకు దూకాడు రోశాలు. పడడం, పడడం బిళ్ళబీటుగా పడ్డాడు. నడుం కలుక్కుమంది. 'అమ్మా' అంటూ రెండు చేతులతో నడుం పట్టుకుని లేవబోయి మెరిసిన మెరుపు వెలుగులో తన ముందు పడి వున్న ఆకారాన్ని చూసి 'అమ్మా!' అంటు కేక వేస్తూ ఒక్క ఉదుటున బురద నీళ్ళలో బోర్లగిల పడి వున్న తల్లి శరీరాన్ని తన వేపు త్రిప్పుకుని మొహాన్ని చేతులతో తడుముతూ 'అమ్మా, అమ్మా' అంటూ పిలిచాడు. మూలచ్చి కట్టెలో ఊపిరి దూర తీరాలకు ఎగిరిపోయి చాలా సేపయినట్లుంది. ఉలుకూ లేదు, పలుకూ లేదు. గుండెల్లో నుంచి దుఃఖం గోదారి వెల్లువలా తోసుకొచ్చింది. తల్లి మొహంలో మొహం పెట్టి గొల్లుమన్నాడు. అదిగో అప్పుడు జరిగిందా సంఘ టన. మోంచి గురప దెబ్బ రోశాలు తల మీద పడడం, రోశాలు స్పృహ తప్పి పడిపోవడం!

* * * *

తలంతా సలుపులు పెడుతుంటే, తన శరీరం మీదే సూర్యుడు కాపురం పెట్టినట్టు ఒళ్ళంతా సళ సళ కాగిపోతుంటే మూలుగుతూ లేచికూర్చున్నాడు రోశాలు. మెల్లగా కండ్లు విప్పాడు.

అది పోలీసు స్టేషనని, తను లాకప్‌లో వున్నానని రోశాలుకు అర్థం గావడానికి ఎంతో సేపు పట్టలేదు. గొంతు దాహంతో పిడచకట్టుకుపోయింది.

"ఏరా ఎలా వుంది?" అడిగాడు యస్సై రోశాలు నుద్దేశించి. అడుగుతూనే ఈడ్చి బూటు కాలితో రోశాలు డొక్కలో తన్నాడు. ఎగిరి నాలుగు అడుగులు వెనక్కు పడ్డాడు రోశాలు. ప్రాణం కడగట్టింది. సమాధానం చెప్పాలనే ప్రయత్నం చేశాడు. కానీ లాభం లేకపోయింది. గొంతులో గుర గుర మన్న శబ్దం తప్పితే నోట్లోంచి ఒక పదం, వాక్యం బయటికి రాలేదు. జవాన్ల వైపు తిరిగి సైగ చేసి లాకప్పు బయటికి నడిచాడు యస్సై.

అక్కడ తుమ్మ చెట్టు మొదట్లో వెల్లకిల పడి వుంది సుక్క. బట్టలన్నీ చిరిగి పేలికలయిపోయి, నోటి వెంట కారిన నెత్తురు చెంపల మీద, గొంతు మీద గడ్డకట్టి అతి దారుణంగా మానభంగంచేసి చంపేసినట్టు తెలుస్తోంది.

ఒక్క ఉదుటున పోలీసుల్ని విదిలించుకొని సుక్క వేపు పరుగెత్తబోయిన రోశాలు మెడ పట్టుకుని నిలేసి




అడిగాడు యస్సై.

"ఏరా ఇది నీ పనేగా?- నీ తల్లిని చంపింది కూడా నువ్వే కదూ!?"

సుక్కను అలా చేసింది తనా? అమ్మను చంపింది కూడా తనేనా?

కేసు పూర్వాపరాలను పరిశీలించిన అనంతరం రోశాలు అనబడే ఈ ముద్దాయి తన గ్రామంలో పూసలు, పిన్నీసులు, మొలదారాలు అమ్ముకుని బ్రతికే సుక్క అనబడే పూసల అమ్మాయిపైన అఘాయిత్యం చేయడానికి నిశ్చయించుకున్నాడనీ, సమయం కొరకు వేచి చూస్తున్న ముద్దాయికి సుక్కదొర గడికి తన తల్లితో కలిసి వెళ్ళిందని తెలిసి తల్లి తనను అడ్డుకోదని, పైగా చట్టం పరిధిలోనికొస్తే తనకు సాక్ష్యంగా సహకరిస్తుందని భావించాడని, గడినుండి ఇంటికి వస్తున్న సుక్కపైన తల్లి సమక్షంలోనే అఘాయిత్యా నికి పాలుపడబోగా, సహజంగా స్త్రీ అయినందువల్ల సాటి స్త్రీని రక్షించడంలో కొడుకునే ఎదుర్కొన్న దని, కామంతో ఆవేశంతో సభ్య సమాజ పరిధుల్ని దాటిన ముద్దాయి తనను అడ్డుకున్నది తన తల్లేనన్న ఇంగిత జ్ఞానం, శరీరంపై స్పృహ లేకుండా చేతి కందిన రాతితో తల్లి తల పగులగొట్టి, ప్రాణం కోసం గింజు కుంటున్న తన తల్లిని వదిలేసి, సుక్కను పక్కనే వున్న తుమ్మల్లోనికి లాక్కుపోయి మానభంగం చేసి గొంతు నులిమి చంపేసాడనీ, ఆ తర్వాత పారిపోవడానికి ప్రయత్నిస్తుండగా ఆ ఊరి దొర జీతగాండ్లకు దొరికి దొర సహాయంతో పోలీసుల కప్పగించబడ్డాడనీ కోర్టు భావించి, మరణ శిక్షను విధించింది.

* * * *

బ్యారక్ నెంబర్ నాలుగు ఖైదీలు అంతకు ముందు ఎంతోమంది కథలు విన్నారు కానీ రోశాలు కథ విన్నాక వాళ్ళ మనసులు బరువెక్కిపోయాయి.

* * * *

శివరాత్రి దగ్గర పడింది. గుప్పిళ్ళు తెరిస్తే, నంక లెత్తితే చలి తన ప్రతాపాన్ని చూపించడానికి యథా శక్తి ప్రయత్నిస్తోంది. జైలు మెయిన్ టవర్ మీది ఇత్తడి గంట సమయం రెండయినట్లుగా ఠంగు, ఠంగుమని రెండుసార్లు మ్రోగింది. బ్యారక్ నెంబర్ నాలుగులోని నైజాం నవాబు కాలంనాటి పరుపుడు బండలు శరీరంలో ఏ అవయవం తాకినా చివ్వున ప్రాణాలు లాగేస్తున్నాయి.

ఆలోచనంతో, చలితో నిద్ర పట్టక అటు- ఇటు మెసులుతున్నాడు రోశాలు.

రోశాలూ! రోశాలు!!

ఎవరో గుసగుసగా పిలుస్తున్నట్టు తట్టినట్లు అని పించి మొహం మీది గొంగలి ప్రక్కకు తీసి ఉలిక్కిపడుతూ లేచి కూర్చున్నాడు రోశాలు. ఎదురుగా మొంగాళ్ళమీద కూర్చుని కనిపించాడు సాపులు.

"ఏందన్నా! ఏందే!" పెద్ద గొంతుతో పలుకరించ బోయిన రోశాలును మాట్లాడవద్దంటూ సైగ చేసి, రోశాలు చేయి పట్టుకుని పైకి లేపాడు సాపులు. ఎటాచ్‌డ్ లావెట్రీలోనికెళ్ళి బాగా నానబెట్టిన రెండు గొంగళ్ళు, ఒక ఇనుప గరిట, జైల్లో మిగిలిపోయిన బొగ్గులు బస్తాలు కుట్టడానికి ఉపయోగించే దబ్బనం తీసుకొచ్చాడు. బ్యారక్‌లో లైటు ఆర్పేసాడు. మెల్లిగా తడుముకుంటూ కటకటాల తలుపు దగ్గరికి వెళ్ళి పది నిమిషాలు శ్రమపడ్డాడు. తాళం కప్ప (బయటి నుండి వేసింది) ఊడిపోయి చేతిలో కొచ్చింది. బొడ్లో దోపుకున్న చిన్న సీసాను బయటికి తీసాడు. జైల్లో వంటలకు ఉపయోగించగా కళాయిల్లో మిగిలిపోయిన నూనె అది. తలుపు గొళ్ళెంలో పోసాడు, ప్రాణా ఉగ్గబట్టుకుని గొళ్ళెం తీసాడు- నూనె జారడం వ[illegible] మెత్తగా ప్రక్కకు జరిగిపోయింది. తలుపు ఇడీలలో కొంత పోసాడు. లంచంగా నూనే తాగేసిన తలుపు ఇడీలు చప్పుడన్న మాటే చేయలేదు. రోశాలు జరుగుతున్న కార్యక్రమాన్ని బిత్తరపోయి చూస్తున్నాడు. ఒకవైపు తాము తప్పించుకుపోతున్నం దుకు ఆనందం, జరగరానిది జరిగి పట్టుబడితే ఏమవుతుందోనన్న భయం-రెండూ పెనవేసుకుపోయి ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

బ్యారక్ దాటి వంద గజాలు బయటికి వెళ్ళి చూసొచ్చాడు సాపులు. పిట్ట మెసలడం లేదు. ఒకరిద్దరు పహరా కానిస్టేబుల్స్ "బురాన్" కోట్ల వెచ్చదనంలో ఏదో ఒక చీకటి మూలల్లో గుర్రు కొడుతున్నారు. రోశాలును బయటికి రమ్మన్నట్లు సైగ చేసాడు సాపులు. బ్యారక్ వదలి బయటి కొచ్చాడు రోశాలు. ఐసు నీళ్ళు మొహం మీద పోసినట్లు చలిగాలి రివ్వున మొహాన్ని తాకింది. అంత చలిలోనూ రోశాలు చేతులు చెమటతో నిండిపోయాయి భయంతో.

రోశాలు ఎడమచేతి వేళ్ళలో తన కుడిచేతి వేళ్ళను జొనిపి బిగించి పట్టుకుని జైలు వెనుక భాగంలో ప్రధాన ప్రహరీవేపు పరుగెత్తాడు సాపులు రోశాలును ఈడ్చుకెల్తున్నట్లుగా.

* * * *

మరుసటి రోజు పత్రికలన్నీ ఒక వార్తను ప్రముఖంగా ప్రచురించాయి. అడవిగూడెంలో దొర హత్యతోపాటు, బాంబు పేలి ఒక నక్సలైట్ మరణించిన సంగతి ప్రచురించాయి. కొన్ని పత్రికలు రోశాలును గురించీ, సాపులును గురించీ కొన్ని వాస్తవాలతోపాటు ఊహాగానాలను ప్రచురించాయి.